క్లుప్తంగా

పోడు భూములకు పట్టాలివ్వాలి

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో పోడుభూములకు పట్టాలివ్వాలని తుడందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం వెంకటరాజం గురువారం డిమాండ్ చేశారు. మండలంలోని మద్దికల్ గ్రామంలోని ఆదివాసీలు అనేక సంవత్సరాలుగా అటవీభూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని, అయితే అటవీ శాఖ అధికారులు ఆ భూములను స్వాధీన పర్చుకొని ప్లాంటేషన్స్ పెంచుతున్నారన్నారు. తిరిగి ఆ భూములను పంపిణీ చేసి వాటికి పక్కా హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తుడందెబ్బ మండలాధ్యక్షుడు గావిడి మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిపె సమ్మయ్య పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులుగా నరేష్, విజయ్

బెల్లంపల్లి: భారతీయ జనతాపార్టీ (బీజేపీ) పట్టణ ప్రధాన కార్యదర్శులుగా గడ్డం నరేష్, కనకం విజయ్‌ను గురువారం ఎన్నుకున్నట్లు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కోడి రమేశ్ ప్రకటించారు. ఈ మేరకు ఇరువురు ప్రధాన కార్యదర్శులకు నియామకపత్రాలను అందజేశారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ పాల్గొన్నారు.

నేడు రేషన్ బియ్యం వేలం

తాండూర్: మండల పరిధిలో పలు దఫాలుగా సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని(412.15 క్వింటాళ్లు) ఈ నెల 10న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. రేచినిలోని మండల గిడ్డంగుల కేంద్రం(ఎంఎల్ఎస్ పాయింట్) ఆవరణలో ఉదయం 12గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ వేలంలో పాల్గొనాలని సూచించారు.

'సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజ'

జన్నారం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజలో ఉంటుందని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి అన్నారు. పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్ ఎదుట జెండా ఆవిష్కరించారు. 317జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయడానికి సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి నగూరి సత్యనారాయణ, జిల్లా, మండల నాయకులు జాజల శ్రీనివాస్, జాడి మురళి, సత్యనారాయణ, రాజరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

లక్సెట్టిపేట: మంచిర్యాల పట్టణంలో ఈ నెల 12వ తేదీన ఆదివాసీ తోటి సేవా సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకులు వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణ, నూతన కార్యవర్గం నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

నియామకం

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన రాంటెంకి విజయశ్రీని నేతకాని మహర్ సంఘం మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, మందమర్రి పట్టణానికి చెందిన గోలేటి లక్ష్మిని ఉపాధ్యక్షురాలిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.15
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	60
బీరకాయ	90
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
సోరకాయ	20
ఆకుగోబి	60
పూగోబి	70
క్యారెట్	60
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	100

- మంచిర్యాలఅగ్రికల్చర్





లింగాపూర్ మోడల్ హాస్టల్ భవనం

వసతి ప్రారంభమెప్పుడో..?

- లింగాపూర్ మోడల్ హాస్టల్ నిర్మాణానికి రూ.1.28కోట్లు మంజూరు
- 2013 నుంచి కొనసాగుతున్న పనులు
- ప్రారంభంపై స్పష్టతనివ్వని అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

దండేపల్లి: కాంట్రాక్టరు నిర్లక్ష్యమో, అధికారుల పట్టింపులేనితనమో కానీ విద్యార్థులకు శాపంగా మారింది. పదేళ్ల నుంచి పనులు కొనసాగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. పనులకే ఇన్నేళ్లు గడిస్తే, ప్రారంభం ఎప్పుడు చేస్తారో అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. దండేపల్లి మండలం లింగాపూర్ మోడల్ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.28కోట్లు మంజూరు చేయగా, సుమారు 2013లో నిర్మాణ పనులు ప్రారంభించినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. చాలా మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌లో చేరితే హాస్టల్‌వసతి ఉంటుందన్న ఆశతో చేరగా నిరాశగానే మిగిలింది.

వందమందికి సౌకర్యం..

హాస్టల్‌లో కనీసం వంద మంది విద్యార్థినులకు అవకాశం ఉండగా, ఇంటర్మీడియెట్‌కు మొదటి ప్రాధాన్యం, ఆ తరువాత పదోతరగతి అవకాశం ఉంటుంది. అప్పటికీ వంద మంది నిండకపోతే కింది తరగతుల వారికి అవకాశం కల్పిస్తారు. పనులు పూర్తికాకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇళ్ల నుంచి ఆటోలు, బస్సుల్లో కాలేజీకి వస్తుండగా, వారికి ప్రయాణ భారంతో పాటు, సమయం వృథా అవుతోంది. అధికారులు స్పందించి హాస్టల్‌ను త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈడబ్ల్యూఐడీ ఏఈఈ భార్గవ్‌ను 'సాక్షి' వివరణ కోరగా పనులు పూర్తికావస్తున్నాయని, ప్లంబింగ్ పనులు మిగిలి ఉన్నట్లు తెలిపారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి పద్మజను అడగ్గా పనులు పూర్తికాగానే మా ఆధీనంలోకి తీసుకుని, వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఇబ్బంది అవుతోంది



కాలేజీకి రావాలంటే చాలా ఇబ్బంది అవుతోంది. ఆటోల్లో రావడం, పోవడం వల్ల అలసిపోతున్నాం. చదువుకోవాలనే ఆసక్తి దెబ్బతింటుంది. ప్రయాణ బారం మీదపడుతోంది. హాస్టల్‌వసతి ఉంటే ఇబ్బందులు తప్పేవి. మాకు చదువుకునేందుకు సమయం దొరికేది. హాస్టల్ వసతి ఉంటే బాగుండు.

– అనూష, ఇంటర్ విద్యార్థిని, శ్రీరాములపల్లె

హాస్టల్ ప్రారంభించాలి



మోడల్‌స్కూల్‌లో చదువుకునే విద్యార్థినుల కోసం నిర్మించిన హాస్టల్‌ను ప్రారంభించాలి. హాస్టల్ సౌకర్యం ఉంటుందన్న ఆశతో ఇక్కడ చేరితే ఏళ్లుగా నిర్మాణం పనులే జరిగాయి. ఇప్పటికీ ప్రారంభించలేదు. హాస్టల్ సౌకర్యం లేక దూరం నుంచి వచ్చే వారికి ఇబ్బంది అవుతుంది.

– అఖిల, ఇంటర్ విద్యార్థిని, కొర్విచెల్మ

జెండా వెంకటాపూర్‌లో పశువైద్య శిబిరం

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌లో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి రమేశ్‌కుమార్ హాజరై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పశువులను ప్రతిరోజూ గమనించాలని, వ్యాధులు సంభవిస్తే టీకాలు వేయించాలన్నారు. ఎదకు రాని ఆవులకు, గేదెలకు ఇంజెక్షన్ వేపించాలని సూచించారు. యువత పాడి పరిశ్రమపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునిత, నాయకులు సుధాకర్, తిరుపతి, సిబ్బంది రవి, అనిల్, క్రిష్ణకుమార్ పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

'చలో కలెక్టరేట్' విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ నాయకులతో సమావేశం నిర్వహించారు. పత్తికి మద్దతు ధర ప్రకటించాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 10న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే 'చలో కలెక్టరేట్' ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రైతుసంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయకార్మికసంఘం ఆధ్వర్యంలో పత్తికి మద్దతు ధర రూ.12వేలు చెల్లించాలని, దళారి వ్యవస్థను రద్దు చేయాలని, సీసీఐ ద్వారానే పత్తి కొనుగోలు చేయాలనే డిమాండ్లతో చలో కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ సంఘాలు మద్దతు పలుకుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, డీవైఎఫ్ఐ నాయకులు ప్రేంకుమార్, మహేందర్, సింగరేణి కాంట్రాక్టు కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

ఈజీఎస్ పనులపై సమీక్ష సమావేశం

కాసిపేట: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో ఎం.ఏ.ఆలీం ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు, పని తీరును అడిగి తెలుసుకున్నారు. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని నర్సరీలను, పల్లెప్రకృతి వనాలను నిత్యం పర్యవేక్షిస్తూ మొక్కలు కాపాడుకోవాలని, నిర్లక్ష్యం చేసినట్లయితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పనులు ప్రారంభం

కాసిపేట: మండల కేంద్రం నుంచి అశోక్‌నగర్‌కు వెళ్లే వాగుపై నూతనంగా బ్రిడ్జి నిర్మించడానికి రూ.3కోట్ల నిధులు మంజూరుకాగా గురువారం ఎంపీపీ రొడ్డ లక్ష్మి పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నీల రాంచందర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టాలి

తాండూర్: సింగరేణిలోని పలు ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ క్లరికల్ స్టాఫ్‌కు వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ చేపట్టాలని పలువురు క్లరికల్ సిబ్బంది డిమాండ్ చేశారు. యాజమాన్యం అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ బీపీఏ ఓసీపీ-2 క్లరికల్ సిబ్బంది గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గని మేనేజర్ మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా చేపట్టబోయే క్లరికల్ ఖాళీల భర్తీ ప్రక్రియకు ముందే సీనియర్ క్లరికల్‌కు అవకాశం కల్పించాలని కోరారు. క్లరికల్ సిబ్బంది నిరసనకు ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్ధంశెట్టి రాజమోగిళి, బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్‌లు సంఘీభావం తెలియజేశారు. క్లర్క్‌ల న్యాయమైన డిమాండ్లను వెంటనే యాజమాన్యం పరిష్కరించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీనియర్ క్లర్క్‌లు రాజేందర్, రాజన్న, కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న క్లరికల్ సిబ్బంది

బ్లాంకెట్స్, హైజనిక్ కిట్లు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామ పంచాయతీలోని గిరిజన తాండా అయిన కొలాంగూడి తాండాలో మొత్తం 45గిరిజన తాండా కుటుంబాలకు గురువారం మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లాంకెట్స్, హైజనిక్ కిట్లు అందజేశారు. సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో వంట సామగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. గిరిజనుల కుటుంబాల జీవనశైలీలో మార్పు రావాలని ఇందుకు సొసైటీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కోశాధికారి పడాల రవీందర్, సభ్యులు మధుసూధన్‌రెడ్డి, నాగేందర్, కాసర్ల రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



గిరిజనులతో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

హాస్టల్ నిర్మించాలని సంతకాల సేకరణ

చెన్నూర్: స్థానికంగా బాలికల హాస్టల్ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ చెన్నూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బాలికల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా చెన్నూర్ మండల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అనిల్ మాట్లాడారు. చెన్నూర్‌లో ఉన్న జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలకు చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల నుంచి విద్యార్థినులు పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని అనేక మంది వస్తున్నారన్నారు. బాలికలకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో విద్యకు దూరమవుతున్నారన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు మధ్యలోనే విద్యను ఆపేస్తున్నారని ఆరోపించారు. త్వరగా చెన్నూర్‌లో బాలికల హాస్టల్ నిర్మించాలని సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, అంజన్న, రవి, ప్రశాంత్, సంజయ్ పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒలింపియాడ్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: ఒలింపియాడ్ కాట్ (నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్) లెవల్-2 ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షల్లో 6 నుంచి 10వ తరగతికి చెందిన విద్యార్థులు 197మంది పాల్గొనగా 78మంది సెలెక్టయ్యారు. ఇందులో 8మంది విద్యార్థులు నగదు ప్రోత్సాహక బహుమతి పొందారని ప్రధానోపాధ్యాయుడు జోబిన్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు సుగుణాకర్, రాజేందర్‌ల చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రాలతో పాటు నగదు ప్రోత్సాహం అందజేశారు. సాయి కాలక్షిత్, అక్షిత, సాయి నిహల్, స్వాకిన్, విక్యాత్‌రాణా, శ్రీతమ్‌రెడ్డి, అక్షయ, అభిలు నగదును అందుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



ఎస్సైలు సుగుణాకర్, రాజేందర్‌తో విద్యార్థులు

రాళ్లవాగుపై వంతెన నిర్మించాలి

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట గ్రామాన్ని ఆనుకుని పారుతున్న రాళ్లవాగుపై వంతెన నిర్మించాలని పీసీసీ మెంబర్ నూకల రమేష్ డిమాండ్ చేశారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అందుగులపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాళ్లవాగు అవతల వేలాది ఎకరాలు వ్యవసాయ భూమి ఉందని, అటు వైపు వెళ్లాలంటే వాగుపైన వంతెన సౌకర్యం లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉపేందర్ గౌడ్, లక్ష్మణ్, రాంచందర్, రజిని, శ్రీనివాస్ తదితరులున్నారు.



సమస్యలు తెలియజేస్తున్న గ్రామస్తులు

జోరుగా కాంగ్రెస్ పాదయాత్ర

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్‌తోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 5వ వార్డు చున్నంబట్టి వాడలో గురువారం హాత్ సే హాత్ జోడో అభియన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయాలు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రకు మద్దతుగానే హాత్ సే హాత్ జోడో యాత్రను చేపడుతున్నట్లు వివరించారు.

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో పాదయాత్ర బెల్లంపల్లి మున్సిపాలిటీలో జోరుగా సాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని 5వార్డు నెంబర్-2 ఇంక్‌లైన్ బస్తీలో హాత్ సే హాత్ జోడో యాత్రకు అనుబంధంగా ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను వివరించి, కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారం చెలాయిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే పనులను వివరించారు. స్థానిక బస్తీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సీ.హెచ్.శంకర్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ బండి ప్రభాకర్, వార్డు మున్సిపల్ కౌన్సిలర్ విజయ తిరుమల, కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు రొడ్డ శారద, తులసీదాస్, ఎనగందుల వెంకటేష్, ఆదర్శ్‌వర్ధన్ రాజు, నయీమ్, మల్లయ్య, మహేందర్, మీనుగు సరోజ, హరీష్, రోహిత్, రాజలింగు, న్యాతరి స్వామి, ఆకాష్ పాల్గొన్నారు.




చున్నంబట్టివాడలో పాదయాత్రలో కొక్కిరాల సురేఖ

నస్పూర్: హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర పట్టణంలోని 22వ వార్డు విద్యానగర్‌లో జరిగింది. కాలనీలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గడప గడపకూ తిరుగుతూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్లు బొద్దున సంధ్యారాణి, గెల్లు రజిత, జిల్లా మహిళా అధ్యక్షురాలు పెంట రజిత, నాయకులు శీపతి మల్లేశ్, పడాల సంజీవ్, ఆడెపు శ్యామల, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం

అటెన్షన్ ప్లీజ్..



బెల్లంపల్లిరూరల్: మండలంలోని తాళ్లగురిజాల సమీపంలోని ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఒక పక్కకు వంగి కుంగిపోవడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు కిందపడి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: రాంమనోహర్, విద్యుత్ శాఖ ఏఈ

ఫోన్ నంబర్ : 94408 11723

నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

కాసిపేట: మండలంలోని దుబ్బగూడం గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు గురువారం రోడ్డుపై ఆందోళన చేపట్టారు. త్రీఫేజ్ కరెంట్ తెల్లవారుజామున 3 గంటలకు ఇవ్వడంతో పంపులు రావడం లేదని, మూడు నాలుగు రోజుల నుంచి విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఎస్సై గంగారాం ట్రాన్స్‌కో, గ్రామ పంచాయతీ అధికారులను పిలిపించారు. విద్యుత్ ఉచితంగా వాడుకోవడం సరికాదని ట్రాన్స్‌కో ఏఈ స్వర్ణలత తెలిపారు. పంచాయతీ నుంచి బిల్లు చెల్లిస్తామని సర్పంచ్ అంగీకరించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు బిగించారు. త్రీఫేజ్ కరెంట్ తమ పరిధిలో లేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సరఫరా ఉంటుందని తెలిపారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై

పంట పొలాల పరిశీలన

భీమారం: మండలంలోని బూర్గుపల్లి, పోలంపల్లి గ్రామాల్లో ఏసంగి వరి పంటలను గురువారం ఏఈవో అరుణ్‌కుమార్ సందర్శించారు. వరి పొలాల్లోకి వెళ్లి పైరును పరిశీలించగా పీకపురుగులు ఉన్నాయని గుర్తించారు. వీటి నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని రైతులను కోరారు. వేసవి ఎండలకు పంటలు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కోటపల్లి/మందమర్రిరూరల్: కంటి సమస్యలతో బాధపడే ప్రతి ఒక్కరూ కంటి వెలుగులో పరీక్షలు చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. కోటపల్లిలో ఎంపీపీ మంత్రి సురేఖ, హాజీపూర్ మండలం ముల్కల్లలో సర్పంచ్ శ్రీనివాస్ కంటి వైద్య శిబిరాలను గురువారం ప్రారంభించారు. మందమర్రి మండలంలోని చిర్రకుంటలో ఐదు రోజులుగా సేవలందించిన కంటి వెలుగు సిబ్బందికి గురువారం ఆ గ్రామ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య శాలువా కప్పి సన్మానించారు.